# చదువు

## గ్రామ, వార్డు సచివాలయ పరీక్షల ప్రత్యేకం



# స్థిరంగా.. స్పష్టంగా!

**గ్రామ, వార్డు సచివాలయ పోస్టులకు ప్రకటించిన అన్ని పరీక్షల్లోనూ జనరల్ స్టడీస్‌లో భాగంగా 'సుస్థిరాభివృద్ధి -పర్యావరణ పరిరక్షణ' అంశం ఉంది. దీనిపై తప్పకుండా ప్రశ్నలు వస్తాయి. పరిధి కొంత ఎక్కువగానే ఉంది. సమాచారం అంతా ఒకే చోట లభించకపోవచ్చు. గత పరీక్షల ఆధారంగా సిలబస్ అంశాలను గుర్తించి అభ్యర్థులు ఒక క్రమ పద్ధతిలో అధ్యయనం చేయాలి. స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలి.**

**సుస్థిరాభివృద్ధి - పర్యావరణ పరిరక్షణ ప్రిపరేషన్**



ప్రపంచ దేశాల్లో సుస్థిరాభివృద్ధిని సాధించడంలో భాగంగా ఐక్యరాజ్య సమితి మొదటిసారి 2000 సంవత్సరంలో సహస్రాభివృద్ధి లక్ష్యాలను (మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్) ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా ఆకలి నిర్మూలన, శిశు మరణాలను తగ్గించడం, మాతా సంరక్షణ; ఎయిడ్స్, మలేరియా లాంటి వ్యాధులను అరికట్టడం, పర్యావరణ సుస్థిరాభివృద్ధిని సాధించడం, ప్రపంచ దేశాల భాగస్వామ్యం తదితర లక్ష్యాలను తీర్మానించింది. అభ్యర్థులు ఈ అంశాలపై దృష్టిపెట్టాలి. ప్రతి అంశాన్ని పూర్తిగా అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తే ప్రశ్న ఏవిధంగా వచ్చినా సమాధానం గుర్తించడానికి వీలవుతుంది.

### ఎలిమినేషన్ విధానం

అన్ని దేశాల్లో అభివృద్ధి లోపించడం, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం అధికమవడంతో ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో ప్రధానంగా పేదరికం, ఆకలిని నిర్మూలించడానికి 2015 సెప్టెంబరు 25న ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో ప్రకటించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను తెలుసుకోవాలి. అవి నాలుగు రకాలుగా ఉంటాయి. విడివిడిగా సాధారణ అవగాహన పెంచుకోవాలి. ఇక్కడ అభ్యర్థులు ప్రధానంగా ఒక విషయాన్ని గమనించాలి. గత పరీక్షల ప్రశ్నలను పరిశీలిస్తే కొన్ని ఎలిమినేషన్ విధానంలో వస్తున్నాయి. అంటే నాలుగు ఐచ్ఛికాల్లో రెండు ప్రశ్నకు ప్రతికూలంగా ఉంటాయి. మిగిలిన రెండింటిలో సమాధానం ఉంటుంది. మౌలికాంశాలపై పట్టు ఉంటే ఈ విషయాన్ని తేలిగ్గా గ్రహించవచ్చు. అప్పుడే అనుకూల, ప్రతికూల జవాబుల విభజన చేయడం అభ్యర్థికి సాధ్యమవుతుంది. సమాధానాన్ని గుర్తించడం సులువవుతుంది.

### సమస్యలు, చట్టాలు

21వ శతాబ్దంలో వేగంగా వస్తున్న మార్పుల వల్ల వాతావరణంలో అనేక మార్పులు సంభవించి పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా అణ్వస్త్రాల ప్రయోగం, కిరణ ధార్మిక విస్ఫోటాలు; వాయు, జల, శబ్ద కాలుష్యాలు పెరగడం వల్ల పర్యావరణ పరిరక్షణ అవసరం ఏర్పడింది. ఆ సమస్యలు, వాటి ఫలితాలు, పరిష్కార మార్గాలను అధ్యయనం చేయాలి. ఇదే నేపథ్యంలో మన దేశంలో జరిగిన చిప్కో ఉద్యమం, బిష్ణోయి ఉద్యమం, బాలియపాల్ క్షిపణి వ్యతిరేక ఉద్యమం, నర్మదా బచావో లాంటి పర్యావరణ ఉద్యమాల వివరాలను తెలుసుకోవాలి. వాటితోపాటు ఈ ఉద్యమాల ఫలితంగా అమల్లోకి వచ్చిన పర్యావరణ చట్టాలను తెలుసుకోవాలి. పరీక్ష సమయం తక్కువ ఉంది కాబట్టి లోతైన అధ్యయనం కంటే స్థూలంగా, స్మార్ట్‌గా ప్రిపేర్ కావడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

### సదస్సులు, సమావేశాలు

పర్యావరణ పరిరక్షణ ఒక బలీయమైన భావనగా ప్రపంచ వ్యాప్తం కావడంతో ఎప్పటికప్పుడు సమావేశాలు, సదస్సులు జరిగాయి. 1972 యూఎన్‌వో స్వీడన్ స్టాక్‌హోం పర్యావరణ సదస్సు మొదలు 2018 మార్చి 11న దిల్లీలో జరిగిన అంతర్జాతీయ సౌరకూటమి సదస్సు వరకు అన్నింటి వివరాలు, లక్ష్యాలను అధ్యయనం చేయాలి. ప్రపంచ వాతావరణ మార్పులను సమీక్షించడానికి ఏర్పాటైన యూఎన్ఎఫ్‌సీసీసీ (United Nations Framework Convention on Climate Change) బాన్ (జర్మనీ) కేంద్రంగా ఏటా వివిధ దేశాలను వేదికగా చేసుకొని సమీక్షా సమావేశాలను నిర్వహిస్తోంది. ఆ వేదికలు, ఏర్పాటు చేసే లక్ష్యాలను తెలుసుకోవాలి.

### రిఫరెన్స్ పుస్తకాలు



- 10వ తరగతి పర్యావరణ అంశాలు
- డిగ్రీ రెండో సంవత్సరం తెలుగు అకాడమీ పర్యావరణం
- పోటీ పరీక్షల కోసం విడుదల చేసిన తెలుగు అకాడమీ పుస్తకం
- డిగ్రీ రెండో సంవత్సరం అర్థశాస్త్రం - తెలుగు అకాడమీ
- పోటీ పరీక్షల కోసం సుస్థిరాభివృద్ధి-పర్యావరణం, తెలుగు అకాడమీ

# నేటి ఆశలు తీరుస్తూ.. రేపటి క్షేమం ఆశిస్తూ..

**జనాభా విస్ఫోటం, అడవుల నిర్మూలన, పారిశ్రామికీకరణ, భూతాపం, భూగర్భ జలాలు అంతరించిపోవడం.. తదితర ఎన్నో పరిణామాల వల్ల పర్యావరణానికి ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుత అవసరాలను తీర్చుకుంటూ.. భావితరాల భవిష్యత్తును రక్షించేందుకు సుస్థిరాభివృద్ధి పేరుతో సాగుతున్న ప్రపంచ దేశాల ప్రయత్నాలపై అభ్యర్థులు అవగాహన ఏర్పరచుకోవాలి.**



ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా 20వ శతాబ్దం మధ్యకాలంలో శాంతి, స్వాతంత్ర్యం, అభివృద్ధి, పర్యావరణం అనే నాలుగు అంశాలను ప్రపంచ సమాజం ప్రముఖంగా ప్రకటించింది. 1950ల్లో అమెరికాలో ప్రత్యేకంగా వ్యవసాయ సాగులో విరివిగా డీడీటీ (డైక్లోరో డైఫినాయిల్ ట్రైక్లోరో ఈథేన్) క్రిమిసంహారక మందును ఎక్కువ మోతాదులో వాడారు. దీంతో పర్యావరణానికి హాని జరగడం మొదలైంది. దీనికి వ్యతిరేకంగా 1962లో అమెరికాకు చెందిన రెచెల్ కార్సన్ 'నిశ్శబ్ద వసంతం' (సైలెంట్ స్ప్రింగ్) అనే పుస్తకం రాశారు. దానిలో ఆర్థికాభివృద్ధి - పర్యావరణానికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని తెలియజేశారు. దీంతో పర్యావరణ హానికి వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగింది. క్రమంగా పర్యావరణాన్ని నిలకడ ఉన్న అభివృద్ధి ద్వారా సాధించాలనే తపనతో సుస్థిరాభివృద్ధి వెలుగులోకి వచ్చింది.

### మూడు భాగాలు

కొనసాగించగలిగే అభివృద్ధిలో ముఖ్యంగా మూడు భాగాలుంటాయి. ఇవి ఒకదానితో ఒకటి సంబంధం కలిగిన స్వతంత్రమైన అంశాలు. ఆర్థిక, సామాజిక, పర్యావరణం అనే ఈ మూడు అంశాల మధ్య సమతూకాన్ని సాధించడం ద్వారానే సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుంది.




### యూఎన్‌ఓ - సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు

**2015** సెప్టెంబరు 25-27 న్యూయార్క్ సర్వప్రతినిధుల సభలో ఐక్యరాజ్యసమితి 2015-30 కాలానికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను తీర్మానించి ప్రకటించింది. వీటిని ప్రపంచ దేశాలు 2030 లోగా సాధించాలి. వీటిలో మొత్తం 17 లక్ష్యాలు, 169 ఉప లక్ష్యాలు ఉన్నాయి. 17 లక్ష్యాలు...1. పేదరికాన్ని రూపుమాపడం. 2. ఆకలిని పోగొట్టి, ఆహార భద్రతను సాధించడం. 3. మెరుగైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించడం. 4. సమ్మిళిత, సమానత్వంతో కూడిన, నాణ్యమైన విద్యను అందించడం. 5. లింగపరమైన సమానత్వం, స్త్రీల సాధికారికతను సాధించడం. 6. తాగునీరు, పరిశుభ్రతను అందుబాటులోకి తీసుకురావడం. 7. శిలాజేతర ఇంధన శక్తి సామర్థ్యాలను పెంపొందించడం. 8. అందరికీ పూర్తిస్థాయి ఉత్పాదక, ఉద్యోగితను కల్పించడం. 9. పారిశ్రామికీకరణ, నవకల్పనలను ప్రోత్సహించడం. 10. ప్రపంచ దేశాల మధ్య అసమానతలను తగ్గించడం. 11. పట్టణాలు, మానవ ఆవాసాలు సురక్షితంగా ఉండేటట్లు చేయడం. 12. ఉత్పత్తి నమూనాలు, వినియోగం అందుబాటులోకి తేవడం. 13. వాతావరణ మార్పులను అరికట్టడానికి సత్వర చర్యలు తీసుకోవడం. 14. సముద్ర వనరులను పరిరక్షించడం. 15. జీవావరణాన్ని పరిరక్షిస్తూ అడవుల పరిరక్షణ, ఎడారీకరణ, నేల క్షీణతను అరికట్టడం. 16. అందరికీ న్యాయం, శాంతి అందుబాటులోకి తేవడం. 17. అభివృద్ధి సాధనకు ప్రపంచ దేశాలను భాగస్వాములుగా చేయడం.



**కొత్త గోవర్ధన్‌రెడ్డి**
విషయ నిపుణులు

### ఐరోపా అడవుల్లో..

'సుస్థిరత్వం' అనే పదాన్ని 19వ శతాబ్దపు మధ్యకాలంలో ఐరోపా అటవీ అధికారులు ప్రవేశపెట్టారు. ఆనాటి యూరోపియన్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అడవులే ప్రధాన చోదక శక్తులు. అక్కడి అడవుల్లో చెట్లు తరిగిపోయినా, వాటిని కొట్టివేసినా తిరిగి ఆ ప్రాంతంలో చెట్లను నాటి ఆ సంఖ్యను భర్తీచేసి కాపాడేవారు. ఇలా భావితరాల వారికి అడవుల క్షీణత ఉండకూడదనే సంకల్పమే సుస్థిరత్వ ఆవిర్భావానికి దారితీసింది.

### సుస్థిరాభివృద్ధి అంటే?

పర్యావరణానికి ప్రమాదం లేకుండా జరిగే అభివృద్ధిని 'సుస్థిరాభివృద్ధి' అంటారు. ఈ అభివృద్ధి ప్రక్రియలో పర్యావరణ విలీనం భాగమవుతుంది. ప్రజలు ప్రస్తుత అవసరాలను తీర్చుకుంటూ, భావి తరాల క్షేమానికి రాజీలేని మార్గం ద్వారా అభివృద్ధి కొనసాగించడాన్నే 'సుస్థిరాభివృద్ధి' అంటారు. దీన్నే 'నిలకడ ఉన్న' లేదా 'కొనసాగించగలిగే అభివృద్ధి' అని పిలుస్తారు.

### ప్రపంచ వ్యాప్తంగా

- స్టాక్‌హోం ప్రపంచ మానవ పర్యావరణ సదస్సులో (1972) సుస్థిరత్వం అనే పదాన్ని ఉపయోగించారు.
- 'ప్రకృతి, సహజవనరుల రక్షణ అంతర్జాతీయ సంఘం' (IUCNNR) (International Union for the Conservation of Nature and Natural Resources) 1980లో మొదట సుస్థిరాభివృద్ధి అనే భావనను తెలియజేసింది.
- గ్రొహర్లెమ్ బ్రుంట్‌లాండ్ అధ్యక్షతన 'ప్రపంచ పర్యావరణ అభివృద్ధి సంఘం' (The World Commission on Environment and Development) (WCED) 1987లో 'మన ఉమ్మడి భవిష్యత్తు' (Our Common Future) అనే నివేదికలో సుస్థిరత్వం అనే పదానికి అర్థాన్ని ఇచ్చారు. ఈ సుస్థిరత్వం మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. అవసరాలు (needs) 2. అభివృద్ధి (Development)
3. భవిష్యత్తు (Future)

- అవసరాలు అంటే వనరుల పంపిణీలో సంబంధాన్ని కలిగి ఉండడం, అభివృద్ధి అంటే సామాజిక, ఆర్థిక విషయాల్లో మెరుగుదలను సూచించడం. భవిష్యత్తు అంటే రాబోయే తరాలవారికి స్థిరత్వం కొనసాగించడం అని నిర్వచించవచ్చు.
- 1992 జూన్‌లో బ్రెజిల్ రియో-డి-జెనిరోలో పృథ్వీ సదస్సులో ఐక్యరాజ్యసమితి 'ఎజెండా-21' అనే ప్రపంచ ప్రణాళిక ద్వారా సుస్థిరాభివృద్ధిని కొనసాగించడానికి దోహదపడే విధంగా ప్రణాళికలు రూపొందించింది.
- 2002లో దక్షిణాఫ్రికా జోహెన్స్‌బర్గ్ సదస్సులో మొదటి సుస్థిరాభివృద్ధి సమావేశాన్ని నిర్వహించి సుస్థిరత్వం అనే భావనను ప్రపంచవ్యాప్తంగా వెలుగులోకి తెచ్చారు.

### సహస్రాభివృద్ధి లక్ష్యాలు

2000 సెప్టెంబరు 20 నుంచి 22 వరకు జరిగిన ఐక్యరాజ్య సమితి న్యూయార్క్ సాధారణ సభలో మిలీనియం డిక్లరేషన్‌ను ప్రకటించింది. ఇందులో 8 లక్ష్యాలు ఉన్నాయి. వీటిని 2015 సెప్టెంబరు 25 నాటికి సాధించాలని నిర్ణయించింది.




### మాదిరి ప్రశ్నలు

1. 'సుస్థిరాభివృద్ధి కోసం విద్యా దశాబ్దం'ను ఐక్యరాజ్యసమితి ఏ కాలంలో ప్రకటించింది? (డిప్యూటీ సర్వేయర్-2017)
   1) 2000-10 2) 2005-15 3) 2015-25 4) 2020-30
2. 'ఎజెండా-21' దేనికి సంబంధించింది? (డీఎల్, 2007)
   1) ఎడారీకరణ 2) అడవుల పరిరక్షణ
   3) సుస్థిరాభివృద్ధి 4) జీవవైవిధ్యం
3. కింది వాటిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగం కానివి? (గ్రూప్-3, 2017)
   1) పేదరిక నిర్మూలన
   2) ప్రపంచశాంతి, న్యాయాన్ని కాపాడడం
   3) అందరికీ నాణ్యమైన విద్య 4) క్రీడా నైపుణ్యాలు పెంచడం
4. 2015 న్యూయార్క్ సాధారణ సభలో మొత్తం ఎన్ని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రకటించారు? (ఏఈ, 2016)
   1) 10 2) 15 3) 17 4) 18
5. యూఎన్‌వో సాధారణ సభ 70వ సదస్సులో సెప్టెంబరు-2015లో ఏ తీర్మానాన్ని ప్రకటించారు? (గురుకుల్ పీజీటీ - 2018)
   1) మిలీనియం అభివృద్ధి లక్ష్యాలు 2) వాతావరణ మార్పు లక్ష్యాలు
   3) సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు 4) విపత్తు తగ్గింపు లక్ష్యాలు
6. సుస్థిరాభివృద్ధిపై మొదటి సదస్సును ఎక్కడ నిర్వహించారు?
   1) రియో-డి-జెనిరో 2) జోహెన్స్‌బర్గ్
   3) స్టాక్‌హోం 4) సెండాయ్

**సమాధానాలు:** 1-2 2-3 3-4 4-3 5-3 6-2

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### ఐఎల్‌బీఎస్‌లో నర్సు పోస్టులు

దిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బైలియరీ సైన్సెస్ (ఐఎల్‌బీఎస్) కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టులు-ఖాళీలు:** ఎగ్జిక్యూటివ్ నర్సు-95, జూనియర్ ఎగ్జిక్యూటివ్ నర్సు-101. **అర్హత:** జీఎన్ఎం ఉత్తీర్ణత, అనుభవం.
**వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
**ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ ఆధారంగా.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 16
**వెబ్‌సైట్:** www.ilbs.in

### ప్రవేశాలు

#### సీఐటీడీ, హైదరాబాద్

హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) 2019-20 సంవత్సరానికిగానూ వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
**కోర్సులు:** 1) పీజీ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్ అండ్ క్యాడ్/ కామ్ (ఏడాదిన్నర)
2) పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్ (ఏడాది)
**సీట్ల సంఖ్య:** ఒక్కో కోర్సులో 60
**అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో డిప్లొమా, బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత. **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా.
**పరీక్ష తేది:** సెప్టెంబరు 14
**దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** సెప్టెంబరు 7
**వెబ్‌సైట్:** www.citdindia.org

### వాక్-ఇన్స్

#### కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ... సొసైటీ పరిధిలోని ఐఐటీ/ మెడికల్ అకాడమీల్లో తాత్కాలిక ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది.
**పోస్టులు:** ఐఐటీ/ మెడికల్ టీచింగ్ ఫ్యాకల్టీ **సబ్జెక్టులవారీ ఖాళీలు:** ఫిజిక్స్-03, కెమిస్ట్రీ-04, మ్యాథమేటిక్స్-01, బోటనీ/ బయాలజీ-01.
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఎస్సీ/ బీటెక్, టీచింగ్ అనుభవం. **వాక్‌ఇన్ తేది:** ఆగస్టు 21 **వేదిక:** సొసైటీ కార్యదర్శి కార్యాలయం, తాడేపల్లి, గుంటూరు-522501.
**వెబ్‌సైట్:** www.apswreis.info

#### ప్రాజెక్టు అసిస్టెంట్లు

గాంధీనగర్ (గుజరాత్)లోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) - ఇండియా తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్టు అసిస్టెంట్ల భర్తీకి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది. **పోస్టు:** ప్రాజెక్టు అసిస్టెంట్
**ఖాళీలు:** 20 **కాల వ్యవధి:** ప్రాథమికంగా 6 నెలలు
**జీతభత్యాలు:** నెలకు రూ.25,000 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.
**వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
**వాక్‌ఇన్ తేది:** ఆగస్టు 22
**వేదిక:** ఎన్ఐఎఫ్-ఇండియా, గాంధీనగర్, గుజరాత్.
**వెబ్‌సైట్:** http://nif.org.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం
www.eenadupratibha.net చూడవచ్చు